ఉద్యోగులు దూరం.. అభివృద్ధికి శాపం

- కూటమి ప్రభుత్వంలో పలువురికి బదిలీలు
- సచివాలయాలను వేధిస్తున్న సిబ్బంది కొరత
- పనులు జరగక లబ్ధిదారుల పాట్లు
- జగనన్న పాలనను గుర్తుకు తెచ్చుకొంటున్న పేదలు


కూనవరం సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

ఉప్పలగుప్తం: ఇదివరకు గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల ద్వారా పని జరగాలంటే రోజుల తరబడి చెప్పులు అరిగేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే దుస్థితి ఉండేది. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు అంత సులువుగా జరగవనే అపనమ్మకం ప్రజల్లో బలంగా పాతుకు పోయింది. ఇటువంటి తరుణంలో 2019 ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల్లోని అపనమ్మకాన్ని దూరం చేస్తూ సరికొత్త పాలనకు నాంది పలికింది. సుపరిపాలనే ధ్యేయంగా ప్రతి గ్రామంలోను సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు పలు రకాల ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు వెళ్లే పని లేకుండా వలంటీర్లను ఏర్పాటు చేసి వారి ద్వారా పథకాలను ప్రజలకు చేరువ చేసింది. ప్రతి సచివాలయంలోనూ ఆయా శాఖలకు సంబంధించి గ్రేడ్-5 కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంటు, వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంటు, గ్రామ ఇంజినీరు అసిస్టెంటు, గ్రామ అగ్రికల్చర్, హార్టీకల్చర్ అసిస్టెంటు, మహిళా పోలీసు, ఎనర్జీ అసిస్టెంటు (జేఎల్ఎం), ఏఎన్ఎం, గ్రామ సర్వే అసిస్టెంటు, గ్రామ పశు సంవర్ధక, మత్స్యశాఖ అసిస్టెంటు, గ్రామ రెవెన్యూ అధికారులుగా 11 మంది ఉద్యోగులను నియమించారు. వీరిని ప్రతి సచివాలయ పరిధిలో ఉన్న పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవోల పర్యవేక్షణలో విధులు నిర్వర్తించేలా పూర్తి బాధ్యతలు అప్పగించారు. గ్రామంలో ప్రతి గడపకు ప్రభుత్వ పథకాలు అందేలా ఈ సచివాలయ ఉద్యోగుల పర్యవేక్షణలో ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించారు. ప్రభుత్వం నుంచి ఏదైనా ఆదేశాలు వచ్చినప్పుడు సచివాలయ సిబ్బంది సూచనలతో లబ్ధిదారునికి సంబంధించిన పూర్తి వివరాలను వారు కార్యాలయాలకు వెళ్లకుండానే వలంటీర్లు సచివాలయ సిబ్బందికి అందించేవారు.

వలంటీర్ వ్యవస్థపై అక్కసు

ఇంత సులువుగా జరుగుతున్న గ్రామ పరిపాలనను చూసి కూటమి ప్రభుత్వం ఓర్వలేకపోయింది. ఈ వ్యవస్థను ఎలాగైనా నిర్వీర్యం చేయాలనే దురుద్దేశంతో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వలంటీర్‌లతో పనిలేదంటూ పక్కకు పెట్టేశారు. నాడు వలంటీర్ వ్యవస్థతో కావాల్సిన సమాచారాన్ని కార్యాలయాల వద్దకు తెప్పించుకునే ఉద్యోగులు నేటి ప్రభుత్వంలో వలంటీర్ విధులను సైతం వారే నిర్వహించుకునే స్థాయికి ప్రభుత్వం తీసుకువచ్చింది. సచివాలయాల్లో విధులు నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే ఉద్యోగులపై అదనపు పని భారాన్ని మోపి వారు కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో లేకుండా చేస్తున్నారు. దీంతో ప్రజలు మరలా కార్యాలయాల బాట పడుతున్నారు.

ఖాళీల భర్తీలో అలసత్వం

అమలాపురం నియోజకవర్గంలో అమలాపురం మున్సిపాలిటీ, అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల్లో 84 గ్రామ, వార్డు సచివాలయాల్లో 835 మంది ఉద్యోగులు పని చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం 657 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ, ముమ్మిడివరం రూరల్, కాట్రేనికోన, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల పరిధిలో 74 సచివాలయాల్లో 779 మంది సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వర్తించాల్సి ఉండగా 627 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగతా ఉద్యోగులంతా బదిలీలు, డిప్యూటేషన్‌పై వేరే ప్రాంతాలకు వెళ్లారు. వీరి స్థానంలో వేరే ప్రాంతాల నుంచి బదిలీలపై ఈ మండలాలకు రాకపోవటంతో ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గింది. దీనికి తోడు మరికొంత మంది ఉద్యోగులు వైద్య సెలవులు పెట్టుకోవడంతో ప్రస్తుతం ఉన్న సచివాలయ ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. వీటికి తోడు ప్రభుత్వం ఈ మధ్య కాలంలో ఏర్పాటు చేసిన పలు రకాల సర్వేలు, పింఛన్ల పంపిణీ, బీఎల్వో విధులు, ఉన్నతాధికారులతో సమావేశాలు వంటి పనులతో సచివాలయ సిబ్బంది అదనపు ఉద్యోగ భారానికి గురై కార్యాలయాల్లో కంటే బయటే ఎక్కువగా ఉంటున్నారు. దీంతో ఏదైనా పని నిమిత్తం గ్రామాల్లో ఉన్న సచివాలయాలకు వెళితే కార్యాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పరిపాలన సజావుగా సాగే సచివాలయాల్లో సిబ్బంది కొరతతో మళ్లీ పూర్వపు రోజులు గుర్తొస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి గ్రామ, వార్డు సచివాలయాలకు సరిపడా సిబ్బందిని నియమించి ఖాళీలను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి



చినగాడవిల్లి సచివాలయంలో 11 మంది ఉద్యోగులకు గాను ప్రస్తుతం ఏడుగురు ఉద్యోగులు మాత్రమే పని చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ప్రభుత్వం ఇస్తున్న టార్గెట్‌లతో వారు ఎప్పుడు చూసినా బయట గ్రామాల్లోనే ఉంటున్నారు. దీంతో స్థానికులకు అందుబాటులో ఉండని పరిస్థితి నెలకొంది. దీనివల్ల మాలాంటి సామాన్యులకు కార్యాలయంలో ఏదైనా పని చేయించుకోవాలంటే పలుమార్లు తిరగాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి సచివాలయాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి సిబ్బందిని ప్రజలకు అందుబాటులో ఉంచాలి.

బద్రి మూలాస్వామి, చినగాడవిల్లి గ్రామస్తుడు, ఉప్పలగుప్తం మండలం.

క్లుప్తంగా

హైందవ శంఖారావం విజయవంతానికి పిలుపు

అల్లవరం: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావ సభను జయప్రదం చేయాలని ఆర్ఎస్ఎస్ జిల్లా నాయకులు బమ్మిటిపాటి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. మొగళ్లమూరులోని రామాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ సోదరులు పెద్ద ఎత్తున తరలివచ్చి హైందవ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కట్టా నారాయణమూర్తి, రామచంద్రరావు, గుడాల పుల్లయ్యశెట్టి, కర్రి శ్రీను, కాంద్రేగుల బాలాజీ, బొంతు నాగేశ్వరరావు, అల్లు అజయ్, కట్టా బుజ్జి, రామకృష్ణ, కాంద్రేగుల రమేష్, కట్టా తేజ తదితరులు పాల్గొన్నారు.

మాధవరావు మృతికి నివాళి

అమలాపురం టౌన్: తెలంగాణా హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు, న్యాయవాది గొర్రెపాటి మాధవరావు అకాల మరణం తీరని లోటని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఇక్బాల్, నామాడి శ్రీధర్‌లు పేర్కొన్నారు. ఆయన మరణం పట్ల వారు సంతాపం వ్యక్తం చేశారు. మానవ హక్కుల వేదిక తెలంగాణా రాష్ట్ర అధ్యక్షునిగా గతంలో బాధ్యతలు నిర్వర్తించిన మాధవరావు అనేక పోరాటాలు, ఉద్యమాల ద్వారా ఎన్నో హక్కుల ఫలితాలను సాధించారని గుర్తు చేశారు.

నడింపల్లి సేవలు ఎనలేనివి


శ్రీనివాసరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దాట్ల తదితరులు

ఐ.పోలవరం: ప్రజా నాయకుడు నడింపల్లి శ్రీనివాసరాజు సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. శనివారం మురమళ్ల బైర్రాజు ఫౌండేషన్ భవనం వద్ద శ్రీనివాసరాజు 15వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీనివాసరాజు సర్పంచ్‌గా, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా ఎన్నో సేవలు అందించి ప్రజల మన్ననలు పొందారన్నారు. ఈ సందర్భంగా మురమళ్ల గ్రామంలో పేదలకు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, చెల్లి అశోక్, జంపన బాబు, గంజా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

అమిత్‌షా వ్యాఖ్యలు దురదృష్టకరం

ఐ.పోలవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని, ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలని మండల మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఎదుర్లంక అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం వారు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు రేవు శ్రీనివాసరావు, మట్ట గగన వీరుడు, మోకా రవి, కాశి పరివాజ్ కుమార్, వడ్డి గౌతమ్, జనుపల్లి విప్లవ కుమార్‌లు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు అవగాహన సదస్సు


కామనగరువులో అవగాహన సదస్సు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువు గ్రామంలో సారా నిర్మూలనపై అమలాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సారా తాగడం వలన కలిగే దుష్పరిణామాలు, పర్యవసానాలపై ప్రజలకు ఎక్సైజ్ సీఐ వీటీవీ సత్యనారాయణ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కామనగరువు ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్న సమారాధన


దత్తమణికంఠ పూజా మందిరంలో అయ్యప్ప స్వాములు

యానాం: గౌతమీ గోదావరి తీరంలో కొలువైన శ్రీదత్త మణికంఠ పూజా మందిరంలో అయ్యప్ప స్వామి మహిమలను వ్యాపింపజేసిన గురుస్వామి వలీబాబా 15వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా వలీబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అయ్యప్ప స్వామికి పూజల అనంతరం జరిగిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు హాజరయ్యారు.

ప్రయోగాత్మక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి


గొల్లవిల్లిలో వైజ్ఞానిక నమూనాలు పరిశీలిస్తున్న ఎంఈవో కిరణ్‌బాబు తదితరులు

ఉప్పలగుప్తం: విద్యార్థులు చిన్ననాటి నుంచి ప్రయోగాత్మక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈవో కె.కిరణ్‌బాబు సూచించారు. మండల వ్యాప్తంగా ఎనిమిది జెడ్పీ ఉన్నత పాఠశాలలకు సంబంధించి గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి వైజ్ఞానిక నమూనా ప్రదర్శనను శనివారం ఎమ్ఈవో 2 ఎస్.సత్తికృష్ణతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కిరణ్‌బాబు మాట్లాడుతూ 23 రకాల నమూనాలను విద్యార్థులు ప్రదర్శనకు తీసుకువచ్చారన్నారు. ఇందులో భాగంగా స్మార్ట్ విండ్ ఎనర్జీ ప్రాజెక్ట్‌ను రూపొందించిన గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల మొదటి స్థానం, టచ్ లెస్ కాలింగ్ బెల్ నమూనాతో భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల రెండవ స్థానం, బ్లడ్ గ్రూప్ టెస్టింగ్ నమూనాతో చల్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల మూడవ స్థానంలో నిలిచాయన్నారు. ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఎల్.రాణి, ఎస్‌వీవీ.సత్యనారాయణ, బి.అప్పారావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు సూర్యప్రకాశం, దుర్గాదేవి తదితరులు

అమలాపురం రూరల్: వచ్చే నెల 5 నుంచి 8వ తేదీ వరకు కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల వాల్‌పోస్టర్‌ను మండల విద్యాశాఖ అధికారులు గుబ్బల సూర్యప్రకాష్, ఎస్ దుర్గాదేవిలు ఆవిష్కరించారు. ఎంఈవో కార్యాలయంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో అమలాపురం మండల యూటీఎఫ్ నాయకులు, ఎంఆర్‌సీ ఉద్యోగులు కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం యూటీఎఫ్ అలుపెరుగని పోరాటాలు చేస్తోందని నాయకులు తెలిపారు. స్వర్ణోత్సవ వేడుకల్లో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ


ఈశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్

ఐ.పోలవరం: మండలంలోని పాత ఇంజరానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మచ్చా ఈశ్వరరావు (53) ఇటీవల మృతి చెందారు. అనారోగ్యంతో బాధ పడుతూ ఆయన మృతి చెందడంపై మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొన్నాడ వెంకట సతీష్ కుమార్ శనివారం పరామర్శించారు. వారి కుటుంబానికి ధైర్యం చెప్పి అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతి రాజు, ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, ఏలూరి ఆదినారాయణ, కొండెపూడి కృపా వరప్రసాద్, సుంకర నాగబాబు, చప్పిడి బుజ్జి, మాగపు వీరబాబు, గంగబాబు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ ధరల పెంపు

యానాం: యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్‌లలో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ శనివారం ప్రభుత్వ అదనపు కార్యదర్శి(కమర్షియల్ టాక్స్) ఎల్ మహ్మద్ మనసూర్ నోటిఫికేషన్ జారీ చేశారు. పెంచిన ధరలు జనవరి 1నుంచి అమలులోకి వస్తాయని పేర్కొన్నారు. వ్యాట్ ఆదాయాన్ని పెంచుకునే విధంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలను పెంచారు. ప్రస్తుతం పుదుచ్చేరి వ్యాప్తంగా పెట్రోల్‌పై 2.44 శాతం, డీజిల్‌పై 2.57 శాతం చొప్పున వ్యాట్ టాక్స్‌ను పెంచారు. దీంతో యానాంలో పెట్రోల్‌పై 15.26 శాతం ఉన్న వ్యాట్ ట్యాక్స్ 17.69 శాతానికి, డీజిల్‌పై 6.91 శాతం ఉన్న ట్యాక్స్ 8.65 శాతం పెరిగినట్లయ్యింది. పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు రూ.2 చొప్పున పెరగనున్నాయి. సరిహద్దులో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో పోల్చిచూస్తే ఈ ధరలు తక్కువగానే ఉన్నాయి. యానాంలో ప్రస్తుతం లీటరు పెట్రోల్ ధర రూ.84.75 పైసలు ఉంది. ధరల పెంపు ఫలితంగా ప్రభుత్వానికి వ్యాట్ ఆదాయం రూ.640 కోట్ల నుంచి రూ.740 కోట్లకు పెరగనుంది.

విద్యార్థులకు రగ్గుల పంపిణీ


రగ్గులు పంపిణీ చేస్తున్న కోనసీమ ఆహార నిధి సంస్థ ప్రతినిధులు

అమలాపురం టౌన్: కోనసీమ ఆహార నిధి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ ఆధ్వర్యంలో స్థానిక లూయిా అంధుల పాఠశాల చిన్నారులకు ఉచిత రగ్గుల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. చలికాలం కావడంతో అంధ విద్యార్థులు చలికి ఇబ్బంది పడుతున్న క్రమంలో వీరంశెట్టి సతీష్ ఈ వితరణ కార్యక్రమం చేపట్టారు. కోనసీమ ఆహార నిధి సంస్థ ప్రతినిధులు వీరు గట్టిం, పోలిశెట్టి పవన్ మహేష్, జి.జగదీష్, వెదుళ్లపల్లి అయ్యప్పస్వామి, చీకట్ల కిరణ్, పెదమల్లు అయ్యప్ప తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అలరించిన గజల్స్


కవి సమ్మేళనంలో గజల్స్ వినిపిస్తున్న డాక్టర్ కొల్లూరి

అమలాపురం టౌన్: విజయవాడలో జరుగుతున్న 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో అమలాపురానికి చెందిన కవి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి వ్యక్తిత్వ వికాసం, మానవత్వంపై గజల్స్‌ను మధురంగా వినిపించారు. తెలుగు రచయితల మహాసభల్లో శనివారం జరిగిన కవి సమ్మేళనంలో డాక్టర్ కొల్లూరి రాగయుక్తంగా గజల్స్ పాడి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఆయనను ప్రపంచ తెలుగు రచయితల మహా సభల నిర్వాహకులు జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో సత్కరించారు.

హోరాహోరీగా బీచ్ వాలీబాల్ పోటీలు

ఉత్కంఠ పోరులో విజేత ఏపీ జట్టు


రసవత్తరంగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్- పాండిచ్చేరి జట్ల మధ్య మ్యాచ్

సాక్షి, అమలాపురం: అసలే వాలీబాల్ పోటీలు. గెలుపే లక్ష్యంగా రెండు జట్లు హోరా హోరీగా తలపడితే ఆ మ్యాచ్ ఎంత రసవత్తరంగా జరుగుతుందో అని చెప్పడానికి ఆ రెండు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఓ ఉదాహరణ. ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం బీచ్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి మహిళా బీచ్ వాలీబాల్ పోటీలలో భాగంగా శనివారం రాత్రి ఆంధ్రప్రదేశ్-పాండిచ్చేరిల మధ్య జరిగిన మ్యాచ్ హోరాహోరీగా సాగింది. తొలి సెట్‌ను ఆంధ్రప్రదేశ్ జట్టు 21-17 తేడాతో కైవసం చేసుకోగా, రెండవ సెట్‌ను పాండిచ్చేరి 21-14తో గెలుచుకుంది. దీంతో ఫలితం తేల్చే మూడో సెట్‌పై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. అందుకు తగినట్టుగానే మూడో సెట్టు నువ్వా నేనాఅన్నట్టుగా సాగింది. మూడో సెట్‌ను 15 పాయింట్లకు నిర్వహించారు. అయితే తొలి పాయింటు నుంచి రెండు జట్లు సమానంగా నిలిచాయి. మ్యాచ్ జరిగే క్రమంలో 10-10, 11-11, 12-12 ఇలా ప్రతి పాయింట్ సమానంగా రావటంతో క్రీడా వీక్షకులలో నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. చివరకు 20-18 తేడాతో ఆంధ్రప్రదేశ్ జట్టు విజేతగా నిలిచింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


ప్రమాద స్థలంలో గాయపడ్డ వీరబాబు

తాళ్లరేవు: జాతీయ రహదారిలో చొల్లంగి గొడౌన్స్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ ఏటిమొగకు చెందిన పాలెపు వీరబాబు మట్లపాలెంలోని తన అత్తవారింటికి మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. చొల్లంగి రైస్‌మిల్ సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా యానాం నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరబాబు తలకు బలమైన గాయమైంది. సంఘటనా స్థలానికి చేరుకున్న కోరంగి ఎస్సై సత్యనారాయణ క్షతగాత్రుడ్ని 108లో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రహ్లాదబాబా ఆశ్రమంలో సామూహిక వ్రతాలు


ఆశ్రమంలో పూజలు చేస్తున్న ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్పీ డాక్టర్ కొండా నరసింహారావు దంపతులు

అల్లవరం: కొమరగిరిపట్నం శివారు పందిరి ఆశ్రమంలో సద్గురు శ్రీ ప్రహ్లాద బాబా జయంతిని పురస్కరించుకొని రెండో రోజు డాక్టర్ కాశిన ప్రభాకరరావు, రాంజీ ఆధ్వర్యంలో సామూహిక వ్రతాలు నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం ఏపీ స్పెషల్ ఫోర్స్ ప్రొటెక్షన్ ఎస్పీ డాక్టర్ కొండా నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆశ్రమంలో అఖండ శంఖారావ యుగళం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిక్కవోలు, అనపర్తి, రామచంద్రపురం, కె.గంగవరం, కుయ్యేరు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పలు మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సామూహిక వ్రతాలను ఆచరించారు. అనంతరం అన్న సమారాధన చేపట్టారు.

ముక్కోటి ఏకాదశి నిర్వహణకు ఏర్పాట్లు


ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లపై చర్చిస్తున్న ఈవో వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు

అమలాపురం టౌన్: కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరు గాంచిన అమలాపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలో వచ్చే నెల 10న జరగనున్న ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించాలని ఆలయ ఉత్సవ కమిటీ నిర్ణయించింది. ఆలయ ఈవో యర్రా వెంకటేశ్వరరావు ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లపై ఉత్సవ కమిటీతో శనివారం చర్చించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పక్కా ఏర్పాట్లు చేయాలని ఉత్సవ కమిటీ సూచించింది. ఆలయ ఈవో వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు జంగా అబ్బాయి వెంకన్న, మోకా వెంకట సుబ్బారావు, దున్నాల వేణు, గోకరకొండ లక్ష్మణరావు, కుంచే వెంకన్నబాబు, గన్నవరపు సూర్య భాస్కరరావు, ఎ.దొరబాబులు ఏర్పాట్లపై సూచనలు చేశారు.

ఆక్రమణల తొలగింపు


ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి, అధికారులు

యానాం: బైపాస్ రహదారి సమీపంలో ఉదయకృష్ణ వంశీనగర్‌కు వెళ్లే దారిలో పలు ఆక్రమణలను ఆర్ఏఓ మునిస్వామి పర్యవేక్షణలో పోలీసులు తొలగించారు. పలు బడ్డీలు, వ్యాపార సముదాయాలను రహదారిని అనుకొని ఆక్రమిత స్థలాలలో నిర్మాణం చేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుతో అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించారు. రహదారికి అడ్డంగా ఉన్న చెట్లను సైతం తొలగించి వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందులు లేకుండా చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ కె రామకృష్ణ, డీటీ జ్యోతి వెంకటేశ్వరరావు, ఎస్సై కవల నానాజీ పాల్గొన్నారు.

రైతుల ఫిర్యాదుతో చేపల వేట నిలిపివేత

యానాం: గౌతమీ గోదావరిలో వాటర్ బాటిల్ ఉపయోగించి చేపల వేట చేస్తున్న దృశ్యాన్ని చూసేందుకు స్థానిక కనకాలపేట పుష్కరఘాట్ తదితర ప్రాంతాలకు అధిక సంఖ్యలో జనం తరలి వస్తుండటంతో తమకు ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానిక రైతాంగం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రైతుల ఫిర్యాదు మేరకు ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్సై నూకరాజు తదితరులు పోలీసులతో వెళ్లి ఆ ప్రాంతంలోని జనాలను, చేపలు పడుతున్న యువకులను పంపించి వేశారు.

బాలికా రక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో విజయశ్రీ

ఉప్పలగుప్తం: బాలికా రక్షణను సామాజిక బాధ్యతగా గుర్తించాలని సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీవో వై.విజయశ్రీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమానికి సర్పంచ్ చిన్నవరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీపీవో విజయశ్రీ మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు, లైంగిక వేధింపులను అరికట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పీఆర్‌సీ రాజ్‌కుమార్, ఎంఈవో సత్తి సత్యకృష్ణ, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు కెవిఎల్‌డీ కుమారి, కె.లీలాకుమారి, రమాదేవి, షేక్ ఉన్నీషా, శ్రీనివాస్, వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో పూజలు


స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు


అమలాపురం రూరల్: బండారులంక గ్రామంలో వేంచేసి యున్న భువనేశ్వరీ సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో శని త్రయోదశి పూజలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, కొండా చంటి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన సాంకేతిక శిక్షణ తరగతులు


శిక్షణ పొందిన విద్యార్థులు

అల్లవరం: ఓడలరేవులోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో వారం రోజులుగా జరుగుతున్న సాంకేతిక శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఏపీ ఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్, సివిల్, ఏఐడీఎస్ విభాగాలకు చెందిన 900 మంది విద్యార్థులు గేమ్ డిజైన్ యూజింగ్, 3 డీ స్టాట్ ప్రో అంశాలపై శిక్షణ పొందారని ప్రిన్సిపాల్ మహేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధ్యాపకులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు చిత్ర నివాళి


చంద్ర కుమార్ గీసిన మన్మోహన్‌సింగ్ చిత్రం

అమలాపురం రూరల్: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి ఓ చిత్రలేఖన ఉపాధ్యాయుడు ఆయన చిత్రం గీసి చిత్ర నివాళి అర్పించారు. అమలాపురం మండలం పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ వాటర్ కలర్స్ ఉపయోగించి డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రాన్ని వేశారు. ఈ చిత్రం పలువురిని ఆకట్టుకుంది. మన్మోహన్ సింగ్ మృతికి సంతాప సూచికగా ఈ చిత్రం వేసినట్లు నరసింహ చంద్ర కుమార్ తెలిపారు.